క్లుప్తంగా

ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు



మంటల్లో దగ్ధమైన ట్యాంకర్

శామీర్‌పేట్: శామీర్‌పేట పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగిన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ నుంచి శామీర్‌పేట వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సీఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎదులాబాద్‌కు చెందిన కృష్ణ (31) ఘనాపూర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని గోదాంగా చేసుకుని సరుకులను టాటాఏస్ వాహనంలో దుకాణాల్లో విక్రయిస్తుంటాడు. శుక్రవారం ఉదయం గోదాంకు వెళ్లిన అతడు సాయంత్రం వరకు ఇంటికి చేరుకోలేదు. ఫోన్ చేస్తే తీయకపోవడంతో అతడి తండ్రి ఘనాపూర్‌లోని గోదాంకు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నట్లు తండ్రి తెలిపాడు. తండ్రి ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో కలిసి పనిచేస్తాం

అల్వాల్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు మేము సైతం అంటున్నారు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ(ఎస్సీఎస్సీ) కౌన్సిల్ సభ్యులు. సంక్రాంతి వరుస సెలవుల కారణంగా దొంగతనాల నివారణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వలంటరీ సభ్యులు పోలీసులతో కలిసి విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వారు పోలీసులతో కలిసి పెట్రోలింగ్ విధులు నిర్వహించారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: అల్వాల్‌లోని హరిదాస మండపం వద్ద శనివారం బీజేపీ నాయకులు సుజాత ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్ల వినయ్, శంకర్, మాధవ్, లక్ష్మణ్, లావణ్య, కృష్ణారెడ్డి, మాణిక్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కాప్రా: అన్నదానం చేయడం గొప్ప విషయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నిర్మల్‌నగర్‌లోని రామాలయంలో స్థానికుడు సికిందర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టేవారిని ప్రోత్సహించాలన్నారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ 52వ బ్రహ్మోత్సవాలను ఈనెల 25 – 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. 25న సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహావచనం, రక్షాబంధనం, వేద పారాయణం, ఆరగింపు, హారతి, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి 10 గంటలకు ద్వార బంధనం, 26వ తేదీ ఉదయం 6గంటలకు ప్రభోదిక వేదపారాయణం, 8గంటలకు అభిషేకం, 9.30 గంటలకు హోమం, 10.30 గంటలకు ధ్వజారోహణ, మధ్యాహ్నం 12గంటలకు స్వామి తిరుకల్యాణ మహోత్సవం, 27వ తేదీ సాయంత్రం 4గంటలకు స్వామివారి పల్లకి సేవ, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

బోడుప్పల్: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మకు కల్యాణ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలో దోమల మందు కొట్టించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా చెత్త పేరుకుపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వైభవంగా భోగి సంబరాలు



ఘట్‌కేసర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు, మేడ్చల్ మండలంలో శనివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున భోగి మంటలు వేసి ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా గడిపారు. మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి, నవధాన్యాలు, గొబ్బెమ్మలతో అందంగా అలంకరించారు.

ఏపీకి స్థానిక నాయకులు..

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహిస్తుండడంతో అన్ని పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ఏపీ వెళ్లారు. కోడి పందేలలో పాల్గొని ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఘట్‌కేసర్: భోగి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇల్ల ముందు కల్లాపి చల్లి రంగులతో ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్యలో గొబ్బిళ్లను ఉంచి రేగి పండ్లు, నవధాన్యాలతో అలంకరించారు.

ముగ్గుల పోటీలు..

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వెస్ట్ గాంధీనగర్‌కాలనీలో సంక్రాంతి సందర్భంగా శనివారం కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

దుకాణాల వద్ద రద్దీ..

ఘట్‌కేసర్: పట్టణంలోని దుకాణాల్లో సంక్రాంతి పర్వదినం సందడి నెలకొంది. ముగ్గులు, పట్టణంలోని బస్ టెర్మినల్, రైల్వేస్టేషన్, ఎదులాబాద్ రోడ్డులో రంగులు, గాలి పటాల దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో కొనుగోలుదారులతో మార్కెట్ రోడ్లన్ని రద్దీగా మారాయి.



నాగారం మున్సిపాలిటీ వెస్ట్‌గాంధీనగర్ కాలనీలో..



కిష్టాపూర్‌లో భోగి మంట వేస్తున్న యువకులు



ఘట్‌కేసర్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఘట్‌కేసర్‌లో గాలిపటాల దుకాణం వద్ద సందడి

నిషేధిత మాంజా విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్



నిషేధిత మాంజా విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జవహర్‌నగర్: నిషేధిత మాంజాను విక్రయిస్తున్న ఆరుగురికి దుకాణదారులను జవహర్‌నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. 29 దుకాణాలలో తనిఖీలు నిర్వహించగా 6 దుకాణాలలో నిషేధిత మాంజాను గుర్తించారు.

నివాళి

కుషాయిగూడ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ కరుణాకర్ అకాల మృతిపట్ల చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం కరుణాకర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. సహచర కార్పొరేటర్ మృతి తనను కలచివేసిందని ఆమె అన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం..

నూతనంగా ఎన్నికైన ఐజీ కాలనీ ఆటో యూనియన్ నేతలు శనివారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను వారు సత్కరించారు.

కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కుషాయిగూడ: చక్రిపురం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కాలనీవాసుల్లో చైతన్యం నింపేందుకు ప్రతి ఏడాది కేలండర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ బాబురాజు,అర్జున్ పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో మూతబడిన పాత హాస్టల్ భవనాలకు మరమ్మతులు పనులు ప్రారంభించనున్నారు. నాలుగేళ్ల క్రితం మూసివేసిన గోదావరి హాస్టల్ (ఏ–హాస్టల్), గత ఏడాదిగా మూతబడిన భగిరథ హాస్టల్(బీ–హాస్టల్) భవనాలను సుమారు రూ.3 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపటి విద్యుత్తు కోసం సోలార్‌షీట్లను అమర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



యమ్నంపేట్‌లో గోదాదేవి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

కీసర: ధనుర్మాసం సందర్భంగా చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, ఎంపీపీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

రమాసత్యనారాయణ స్వామి, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నిరంజన్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోచారం: యమ్నంపేట్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోలగోని రాజేష్, మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని గోదారంగనాథులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు బాలగోని వెంకటేశ్‌గౌడ్, చింతల రాజశేఖర్, సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గొంగళ్ల బాలేష్, నల్లవెల్లి శేఖర్, మాజీ వార్డు సభ్యుడు బొక్క బుచ్చిరెడ్డి, ఈఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: ధనుర్మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. నెల రోజుల నుంచి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నెల రోజులుగా శ్రీవతం ఆచరించి తిరుప్పావై ఆచరించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం పురోహితుల వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు.



చీర్యాల దేవాలయంలో గోదాదేవి కల్యాణోత్సవం



మేడ్చల్ పట్టణం వెంకట్రామయ్య కాలనీలో..



ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో..

‘బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం’



వైన్‌షాప్ వద్ద సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణను సీఎం కేసీఆర్ తాగుబోతుల రాష్ట్రంగా మార్చాడని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. వైన్స్‌లు, బార్లను విచ్చలవిడిగా తెరిచి మద్యం డబ్బుతో సర్కారును నడిపిస్తూ పథకాలు అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు వచ్చిన రైతుబంధు డబ్బుతో పట్టణంలోని వైన్స్‌ల దగ్గర తాగుబోతులకు సంక్రాంతి పండుగ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో లిక్కర్‌పై రూ.10 వేల ఆదాయం వస్తే నేడు తెలంగాణలో రూ.40 వేల కోట్లకు చేరిందని, పేదలను మద్యానికి బానిసలు చేశారన్నారు. గతంలో ఇచ్చిన హామీలు గాలికొదిలి తాజాగా దళితబంధు, గిరిజనబంధు పేరుతో మభ్యపెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ చలనచిత్ర ధృవీకరణ సంస్థ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేశ్, రాజశేఖర్‌రెడ్డి, మహేశ్, మల్లేశ్, సురేశ్, ప్రవీణ్‌రెడ్డి, సాయిలు, అరుణ్, రాఘురాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ క్రీడాకారులతో వెంకటేశ్

ఘట్‌కేసర్: మర్పల్లిగూడలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. అంతకుముందు వాలీబాల్ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. మంచిగా రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. విజేత జట్టుకు రూ.5 వేల నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మణ్, శ్రీకాంత్, షానూర్‌బాబు, వెంకటేశ్, బాలకృష్ణ, నరేశ్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాసం పూజలు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గోదాసమేత మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు శనివారంతో ముగిశాయి. ఆలయంలో నెల రోజుల పాటు భక్తులకు వేదపండితులు నిత్యం పాశురాలు(తిరుప్పావై) వినిపించారు. స్థానిక భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూలు, పండ్లు, ఒడి బియ్యం సమర్పించారు.




ఎదులాబాద్ గోదాదేవి పూజల్లో పాల్గొన్న భక్తులు

3కిలోలతో ఆంజేయస్వామికి వెండి తొడుగు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి ప్రసూన నగర్ శ్రీకోదండ రామాలయంలోని అంజనేయస్వామికి శనివారం కాలనీకి చెందిన మనోజ్‌కుమార్ రెడ్డి,మధుసూదన్‌రెడ్డి సోదరులు రూ.2.4 లక్షలు వచ్చించి చేయించిన 3 కిలోల వెండి తొడుగును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదములు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముప్పిడి రాంచందర్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన మహిళను గుర్తించిన పోలీసులు



రత్నమాల (ఫైల్)

దుండిగల్: హత్యకు గురైన గుర్తు తెలియని మహిళను దుండిగల్ పోలీసులు గుర్తించారు. సూరారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఉన్న వెంకట్రామ్‌నగర్ కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ఓ పాడుబడ్డ గదిలో శుక్రవారం ఓ మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సదరు మహిళను సూరారం శివాలయనగర్‌కు చెందిన నారాయణరెడ్డి భార్య రత్నమాల (60)గా గుర్తించారు. ఆమె జీడిమెట్లలో టీస్టాల్ నడుపుతోందని, హత్యకు గల కారణాలు తెలియరాలేదని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.